




బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

7.33 లక్షల ఎకరాలు బీడు..!



◆ ప్రత్యామ్నాయమూ పెరగలేదు..

◆ 45 మండలాల్లో వర్షాభావం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికీ 46 శాతం భూమి సాగవలేదు. 7.33 లక్షల ఎకరాల భూమి బీడుగా ఉంది. సెప్టంబర్ ప్రారంభంలో పడిన వర్షాలతోనైనా ప్రత్యామ్నాయ పంట ద్వారా సాగు విస్తీర్ణం పెరుగుతుందని భావించారు. కానీ ప్రత్యామ్నాయ పంటల సాగు కూడా పెద్దగా పెరగకపోవడం గమనార్హం. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయిందనే చెప్పాలి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంట సాగు చేసేందుకు వీల్లేకుండా పోయింది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 7.33 లక్షల ఎకరాలు బీడుగా ఉంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 16.15 లక్షల ఎకరాలు సాధారణ సాగు ఉంటుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇందులో ఇప్పటికి సాగైంది 8.82 లక్షల ఎకరాల్లోనే. ఇంకా 7.33 లక్షల ఎకరాల భూమి బీడుగా ఉండటం గమనార్హం. మొత్తం సాగు విస్తీర్ణంలో చూసినప్పుడు 54.6 శాతం భూమిలో మాత్రమే విత్తనం పడింది. తక్కిన 46 శాతం భూమి బీడుగానే ఉంది. జిల్లాలల వారీగా చూసినప్పుడు అనంతపురం జిల్లా సాధారణ సాగు భూమి 9.15 లక్షల ఎకరాలయితే సాగైంది 6.22 లక్షల ఎకరాలు. 68 శాతం సాగైంది. సత్యసాయి జిల్లాలో ఏడు లక్షల ఎకరాలు సాధారణ సాగయితే కేవలం 2.60 లక్షల ఎకరాల్లోనే విత్తనం వేశారు. కేవలం 37 శాతం మాత్రమే సాగైంది. ఈ జిల్లాలో మూడొంతుల భూమి బీడుగా ఉంది.

ప్రత్యామ్నాయమూ పెరగలేదు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాధారం కింద అత్యధికంగా సాగయ్యేది వేరుశనగ పంటయే. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ ఏడాది వేరుశనగ సాధారణ సాగు 10.79 లక్షల ఎకరాలనుకుంటే విత్తనం వేసింది కేవలం 1.46 లక్షల ఎకరాల్లోనే. 11 శాతంలోపే వేరుశనగ సాగైంది. ఆగస్టులో తీవ్ర వర్షాభావంతో రైతులు విత్తనం విత్తుకోలేకపోయారు. ఇక సెప్టంబర్‌లో పడిన వర్షాలకైనా ప్రత్యామ్నాయ పంటలు సాగవుతాయని ఆశిస్తే ఆ పంటల సాగు కూడా పెద్దగా పెరగలేదు. మొక్కజొన్న, రాగులు, సజ్జ కొంత వరకు మాత్రమే పెరిగాయి. సజ్జ పంట అనంతపురం జిల్లాలో 3528 ఎకరాల్లో సాగైంది. ఇది సాధరణం కంటే కొద్దిగా పెరిగింది. ఇక సత్యసాయి జిల్లాలో రాగులు 2390 ఎకరాల్లో సాగైంది. ఇది కూడా కొద్ది మోతాదులో పెరిగింది. మొక్కజొన్న 35 వేల ఎకరాల్లో సాగైంది. తక్కిన ఏ పంటలు సాధారణ సాగుకుమించి పెరగలేదు.

కొనసాగుతన్న వర్షాభావం

సెప్టంబర్ మొదటి వారంలో కొద్దిగా వర్షాలు పడినప్పటికీ ఆ తరువాత మళ్లీ వర్షాభావ పరిస్థితులే కనిపిస్తున్నాయి. అనంతపురం జిల్లా సాధారణ వర్షపాతం ఇప్పటికి 251.5 మిల్లీమీటర్లు కురవాల్సి ఉంది. కాని 186 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. ఇక సత్యసాయి జిల్లాలో 285.5 మిల్లీమీటర్లకుగానూ పడింది 184 మిల్లిమీటర్లు మాత్రమే. ఇది జిల్లా మొత్తంగా చూసినప్పుడు మండలాల వారీగా చూస్తే ఈ వ్యత్యాసాలు మరింత అధికంగానే ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 31 మండలాలకు గానూ 22 మండలాల్లో వర్షాభావం నెలకొంది. సత్యసాయి జిల్లాలో 32 మండలాలకు గానూ 23 మండలాలు వర్షాభావంలో ఉన్నాయి. అందులో ముదిగుబ్బ, లేపాక్షి, పెనుకొండ, రొద్దం మండలాల్లో 60 శాతం కంటే తక్కువ వర్షపాతం పడింది. సెప్టంబర్ మాసంలోనూ చినుకుజాడలేని మండలాలు కొన్ని ఉండటం గమనార్హం. ఉదాహరణకు రాయదుర్గం మండలంలో సెప్టంబర్ మాసం ఒకటవ తేదీ నుంచి ఇప్పటి వరకు చూస్తే కేవలం 7.5 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయింది. ఇది సాధారణంలో 80 శాతం లోటుంది. అదే విధంగా బొమ్మనహళ్‌లో 12 మిల్లీమీటర్లు మాత్రమే సెప్టంబర్‌లో వర్షపాతం నమోదయింది. ఇలా మండలాల వారీగా చూసినప్పుడు అనేక వ్యత్యాసాలున్నాయి.

సమస్యల పరిష్కారానికి పోరాటం

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సమస్యల పరిష్కారంపై మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు దశలవారీగా పోరాటాలను నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ తెలిపారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్లను తీర్చాలని కోరుతూ శుక్రవారం నాడు జిల్లా వ్యాప్త బైక్‌ర్యాలీ అనంతపురం కార్పొరేషన్ కార్యాలయం నుంచి ప్రారంభమైంది. ఈ ర్యాలీని ఎస్.నాగేంద్ర కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. ఈ డిమాండ్లపై వివిధ రూపాలలో ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే రెండు రోజుల బైక్ ర్యాలీని చేపట్టామన్నారు. బైక్ ర్యాలీ అన్ని మున్సిపాల్టీల్లో పర్యటించి కార్మికులను సంఘటితం చేస్తామన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలన్నారు. హెల్త్, రిస్కు అలవెన్సులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఓల్డ్‌టౌన్ ప్రధాన కార్యదర్శి వై.వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏటీఎం.నాగరాజు, కె.నాగభూషణ, నగర అధ్యక్షులు బండారు ఎర్రిస్వామి, ఇంజినీరింగ్ సెక్షన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబులపతి, మురళి, మల్లికార్జున, రాయుడు, అంజి కార్మికులు పాల్గొన్నారు.

300 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి-ఉరవకొండ



నీటిని విడుదల చేస్తున్న వైసిపి నాయకులు, రైతులు

నింబగల్ వద్ద జిబిసి కెనాల్ జీరో బై జీరో వద్ద గేట్లు ఎత్తి 300 క్యూసెక్కుల సాగునీటిని కిందకు విడుదల చేశారు. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ ఆయకట్టు కింద మిరప, జొన్న, పత్తి తదితర పంటలను గడేకల్, డోనేకల్, కడదర బెంచి, ఎన్.తిమ్మా పురం తదితర గ్రామాల రైతులు సాగు చేశారు. జిబిసిలో పూడిక పెరిగిపోవడం, కంపచెట్లు అడ్డంగా పెరగడంతో చివరి ఆయకట్టు వరకు ఉన్న రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితుల్లో నింబగల్లు సమీపంలో ఉన్న జీరో బై జీరో కెనాల్ వద్ద 300 క్యూసెక్కుల సాగునీరు సరఫరా అయ్యేలా గేట్లును ఎత్తారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పవతి భీమిరెడ్డి, వైసిపి నాయకులు నాయకులు కరణం భీమిరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రమేష్, జిల్లా ఎస్సీసెల్ నాయకులు సుంకన్న రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-గుత్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న చెప్పుదాం.. స్పందన కార్యక్రమాల ద్వారా సమస్యలను త్వరతిగతిన పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నిజామీ షాదీఖానాలో 'జగనన్నకు చెపుదాం.. స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బాధితుల నుంచి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని జర్నలిస్టులు తమ ఇంటి పట్టాల సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. 2009లో తమకు రెవెన్యూ అధికారులు ఇంటి పట్టాలు ఇచ్చారని, అయితే సంబంధిత స్థలానికి కొందరు నకిలీ ధృవీకరణ పత్రాలను సృష్టించి కోర్టుకు వెళ్లారని కలెక్టర్‌కు వివరించారు. అలాగే పట్టణంలోని హిందువుల శ్మశాన వాటిక కోసం ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని శ్రీధర్ అనే వ్యక్తి వినతిపత్రం సమర్పించారు. గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ కోరారు. ప్రభుత్వం ఇటీవల నిలిపివేసిన 25 దళిత, గిరిజనుల పథకాలను అమలు చేయాలని ఎం.రామాంజనేయులు విన్నవించారు. ఏపీఐఐసీ ద్వారా దళిత గిరిజనులు పరిశ్రమలు ఏర్పాటుకు రాయితీ రుణాలు ఇవ్వాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీవో రవీంద్ర, డిఆర్‌డిఎ హౌసింగ్ ఇన్‌ఛార్జి పీడీ నరసింహారెడ్డి, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శివాజీరెడ్డి, ఆర్‌ఐ సందీప్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

25లోపు ఈ-పంట నమోదు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్



రాయదుర్గం మండలంలో రైతుతో వివరాలు అడిగి తెలుసుకుంటున్న వ్యవసాయ అధికారులు

ఈనెల 25వ తేదీలోపు ఈ-పంట నమోదు పూర్తి చేయాలని రాయదుర్గం ఎడిఎ లక్ష్మానాయక్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఆవులదట్ల, వేపరాల రైతు భరోసా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి సూపర్ చెక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగుచేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకో వాలన్నారు. ముఖ్యంగా ఖచ్చితమైన పంట, విస్తీర్ణాన్ని నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే ఈకేవైసీ పూర్తిచేయాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులతో వేరుశనగ సాగు చేయని వారు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అలాంటి రైతుల కోసమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొర్ర, ఉలవ, జొన్న విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సీసీఆర్‌సి కార్డులు పొందిన కౌలు రైతులు రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించి బ్యాంకుల్లో రుణం తీసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల పరిధిలోని ఇల్లూరు, కల్లూరు, కనంపల్లి గ్రామాల్లో చేపట్టిన పంట నమోదును అనంతపురం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రవి స్థానిక మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నమోదును పగడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన పొత్తు హాస్యాస్పదం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-ఉరవకొండ

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలే మాట్లాడుతాడని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన పొత్తు ఉంటుందంటూ పవన్‌కళ్యాణ్ అనడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. టిడిపితో ప్యాకేజీ కుదుర్చుకున్నాకే పొత్తులు ఖాయమని తేల్చాడన్నారు. దని యం.యల్.సి. ఎన్ని పార్టీలను కలుపుకుని వచ్చినా మరో 20ఏళ్ల జగన్మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరన్నారు. అవినీతి కేసులో కేంద్ర ప్రభుత్వ సంస్థల కేసులో ముద్దాయిగా ఉన్న చంద్రబాబు అరెస్టును పురందేశ్వరి ఖండించడం విడ్డూరంగా ఉందన్నారు.

ఇంజినీర్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

భావి ఇంజినీర్లు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన పిలుపునిచ్చారు. జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మోడ్రన్ డే బ్రిజస్ అండ్ మెట్రో స్ట్రక్చర్ అనే అంశంపై ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షత ఒక్క రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని విసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ప్రపంచంలో రెండవ అతిపెద్ద రహదారి కలిగిన దేశం భారత్ అన్నారు. ఇలాంటి సదస్సులను అధ్యాపకులు, విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. ముఖ్యంగా భావి ఇంజినీర్లు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇన్స్యూస్ ఆఫ్ బ్రిజ్ ఇంజనీర్స్ ప్రెసిడెంట్ వినయ్ గుప్తా, కోఆర్డినేటర్ పి.ఆర్.భానుమూర్తి, రిజిస్ట్రార్ సి.శశిధర్, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణ కాంతి, సివిల్ విభాగం ఆచార్యులు హెచ్.సుదర్శనరావు, ఆచార్య వైశాలి ఘోర్పడే, విభాగాధిపతులు ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, ఎం.రామశేఖరరెడ్డి, కె.ఎఫ్.భారతి, కళ్యాణి రాధ, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాటరీపై పరిశోధనలు జరగాలి

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో వాటికి వినియోగిస్తున్న బ్యాటరీలపై పరిశోధనలు చేయాలని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన సూచించారు. శుక్రవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో డిజైన్ అండ్ డెవెలప్ మెంట్ ఆఫ్ పవర్ కాన్వర్ట్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్స్ అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కార్యక్రమంలో అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, కళాశాల ప్రిన్సిపాల్ యస్.వి.సత్యనారాయణ, ప్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం డైరెక్టర్ బి.ఈశ్వర్‌రెడ్డి, కన్వీనర్ యం.రామశేఖరరెడ్డి, కోఆర్డినేటర్లు శ్రీనివాసులు, అంకారావు, కలికిరి ఈఈఈ విభాగ అధిపతి బి.జితేంద్రగౌడ్, యస్.శ్రీధర్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధి'పై మాజీమంత్రివి తెలివి తక్కువ మాటలు

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

2019 జనవరి 6న రామగిరిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించి 2లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలని మాజీమంత్రి పరిటాల సునీత తెలివి తక్కువ మాటలు మాట్లాడు తోందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రారంభించారు. ముందుగా నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిగ్గా మూడు నెలల్లో అధికారం కోల్పోతామనగా ప్రారంభించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా 2 లక్షల మంది యువతకు శిక్షణ ఇప్పించి ఉద్యోగాలు ఇప్పించామని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా ఇంతమందికి ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. పరిటాల సునీత తనకు చదువు రాకపోవడం వల్లే ఇలా మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్‌ను ఏర్పాటు చేయడంతోపాటు సచివాలయాన్ని ఏర్పాటు చేసి ఇళ్ల వద్దకే వెళ్లి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. దీన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయన్నారు. యువతకు ఉపాధి కల్పిస్తామంటూ నమ్మబలికి రూ.371 కోట్ల అవినీతికి పాల్పడి నేడు చంద్రబాబు జైలుపాలయ్యారని విమర్శించారు. ఇకపోతే రాప్తాడు నియోజకవర్గంలో తాను అధికారంలోకి వచ్చాక ఇప్పటిదాకా 1700 దాకా ఉచితంగా బోర్లు వేయించినట్లు తెలిపారు. పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చామన్నారు. 20 వేల ఇళ్లను తీసుకొచ్చామన్నారు. ఎన్నో ఏళ్లు అధికారంలో ఉన్న సునీతమ్మ ఆత్మకూరు మండలానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పరిటాల సునీతమ్మ ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, చైర్మన్లు, డైరెక్టర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకేరోజు 5 మెడికల్ కళాశాలల ప్రారంభం చారిత్రాత్మకం

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి

ప్రజాశక్తి-అనంతపురం



ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని వీక్షిస్తున్న వైద్య కళాశాల సిబ్బంది, విద్యార్థులు

ఒకేరోజు ఐదు మెడికల్ కళాశాలలను సిఎం జగన్ ప్రారంభించడం దేశంలోనే చారిత్రాత్మక ఘట్టమని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని వైద్య విద్యార్థులతో సిఎం జగన్ నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో అనంత వైద్య కళాశాలలో ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ వైద్య విద్యార్థులు, పోస్టు గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయనగరంలో సిఎం జగన్ స్వయంగా మెడికల్ కళాశాలను ప్రారంభించగా నంద్యాల, మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరంలో వర్చువల్‌గా ప్రారంభించారన్నారు. అంతేగాకుండా ఈఏడాది నుంచే 750 మంది ఎంబిబిఎస్ విద్యార్థులు వైద్య విద్య చదివే అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. వచ్చే సంవత్సరం మరో ఐదు కళాశాలలను ప్రారంభించాలన్న దృఢ సంకల్పంతో సిఎం జగన్ ఆదేశాలు జారీ చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ కెఎల్.సుబ్రమణ్యం, సహాచార్య బి.ఆర్ శ్యాంప్రసాద్, వైద్యులు వాల్మీకి శ్రీనివాస్, డాక్టర్ తెలుగు మధుసూదన్, ఆశాలత, సుమన గోపీచంద్, బోనాల షహజీర్, పునర్జీవన్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



దుండగులు నరికిన అరటిగెలలు

అరటి గెలలు నరికివేత

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు సూరేపల్లిలో భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసిన అరటి పంట గెలలను గుర్తు తెలియని దుండగులు నరికివేశారు. సిఐ సుబ్రమణ్యం తెలిపిన వివరాల మేరకు.. గొల్లపల్లికి చెందిన రామాంజనేయులు సూరేపల్లికి చెందిన ఇద్దరు రైతుల పొలాన్ని కౌలుకు తీసుకుని అరటి పంటను సాగు చేశాడు. ప్రస్తుతం అరటి పంట గెలలు వేసింది. నెలరోజుల్లోపు గెలలను కోయాల్సి ఉంది. ఈనేపథ్యంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాదాపు 120 అరటి గెలలను నరకడంతోపాటుతో పాటు డ్రిప్పు పైపులను ధ్వంసం చేశారు. శుక్రవారం ఉదయం అరటి పిలకలు కోసేందుకు వెళ్లిన కూలీలు అరటి గెలలు కింద పడడం చూసి రైతు రామాంజనేయులు ఫోన్ ద్వారా తెలిపారు. రామాంజనేయులు తోటకు చేరుకుని బోరున విలపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సిఐ సుబ్రమణ్యం, ఎస్ఐ దిలీప్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతుకు పలువురి పరామర్శ

అరటి గెలలను నరికేసిన మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులును పలువురు నాయకులు పరామర్శించారు. మాజీ మంత్రి సాకే శైలజనాథ్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, మండల కన్వీనర్ బాల రంగయ్య, కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పరామర్శించారు.

బీసీ మహాజన సభ రాష్ట్ర కార్యదర్శిగా రమేష్‌బాబు



తాడిపత్రి రూరల్ : తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన ఎం.వి.రమేష్‌బాబును బిసి మహాజన సభ రాష్ట్ర కార్యదర్శిగా విజయవాడలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. బీసీలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా ముందుండి పోరాడుతానన్నారు. బీసీలు రాజకీయంగా ఎదగాలని, చట్టసభల్లో బీసీలు కీలకంగా మారాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు అనుబంధ సంస్థ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు డిమాండ్ చేశారు. సిఎం జగన్ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జిల్లావ్యాప్తంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన బైక్‌యాత్ర శుక్రవారం గుత్తికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ కాంట్రాక్ట్ కార్మికుల పిఎఫ్, ఇఎస్ఐ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల డెత్ అలవెన్సులు మంజూరు చేయాలన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో మరో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వి.నిర్మల, జగన్, ఎర్రిస్వామి, స్థానిక మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కె.సూర్యనారాయణ, ఎన్.రామాంజనేయులు, ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఓబుళపతి, మురళి, రాజా, బాబా, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : సిఎం జగన్ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ప్రతిపక్ష హోదాలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన బైకు ర్యాలీ శుక్రవారం తాడిపత్రి చేరుకుంది. ఇందులో భాగంగా ర్యాలీగా వచ్చిన మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఏటీఎం నాగరాజు, తాడిపత్రి ఇంజినీరింగ్ సెక్షన్ లీడర్ ఆంజనేయులు బృందానికి స్థానిక సిపిఎం, సిఐటియు, మున్సిపల్ కార్మికులు పట్టణంలోని అశోక్ పిల్లర్ వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను అందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, స్కిల్ సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని, చనిపోయిన అరవ సంవత్సరాలు పైబడి తొలగించిన వారి కుటుంబంలో ఒకరికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.


గుత్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు

పకడ్బందీగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి.దేవి

ప్రజాశక్తి-అనంతపురం

నెలరోజుల పాటు జిల్లాలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ నెలరోజులు పాటు నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రత్యేక వైద్యులను నియమించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల కో ఆర్డినేటర్ డా.పాల్ రవికుమార్, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్లు డా.సుజాత, డా.యుగంధర్, చెన్నకేశవులు, నారాయణస్వామి, మహేంద్రనాథ్, ఓబులు, ఉమాపతి, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి.దేవి

గార్లదిన్నె : మండల పరిధిలోని సిరివరం సచివాలయం పరిధిలో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని ఎంపిడిఒ తేజోష్ణ శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పుట్లూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా తక్కలపల్లి గ్రామంలో డాక్టర్ శ్రీవాణి ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి, సర్పంచి మహేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని వడియంపేట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి సునీత, వైసీపీ మండల కన్వీనర్ అంకే నరేష్, కన్వీనర్ బైపరెడ్డి, వైస్ ఎంపీపీ రాంగోపాల్, వైసిపి నాయకులు అనంత వెంకటరెడ్డి, సతీష్, సెక్రటరీలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మెచ్చిరి గ్రామంలో శుక్రవారం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిడిఒ కొండయ్య పర్యవేక్షించారు. ఇందులో భాగంగా వాలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఇంటింటా సర్వే నిర్వహిస్తూ, అవగాహన కల్పిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష మొబైల్ యాప్ ఉపయోగించే విధానాన్ని చూపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఉల్లెమ్మ, పంచాయతీ కార్యదర్శి భీమేష్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని నెం.2 మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సివిల్ సర్జన్ డా.సైదన్న ఆదేశాలమేరకు విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న విద్యార్థులకు కళ్లద్దాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఇందిరమ్మ, విద్యార్థులు

బెలుగుప్ప : ప్రజల ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే చేపట్టినట్లు ఎంపిడిఒ రామచంద్ర, డాక్టర్ కార్తీక్ కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వైద్య, సచివాలయ సిబ్బంది, వాలంటరీలతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీలు వెంకటేశులు, శ్రీరాములు, ఏఎన్ఎంలు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు

అశోక్‌నగర్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

అనంతపురం : నగరంలోని అశోక్‌నగర్ బ్రిడ్జి నిర్మాణ పనులు అక్టోబర్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సంబంధిత కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. ఈమేరకు శుక్రవారం బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ ఆయన మాట్లాడుతూ కొత్తగా బ్రిడ్జి నిర్మాణం చేస్తుండటంతో రాకపోకలకు కొన్ని రోజులు ఇబ్బందిగా ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు. స్థానికంగా విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉండడంతో విద్యుత్ శాఖ ఈఈ రమేష్‌కు ఫోన్ చేసి స్తంభాలు మార్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, అడిషనల్ కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, 28 డివిజన్ కన్వీనర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు

ఉరవకొండ : ఉరవకొండలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న పాక్ దామన్ హజ్రత్ సయ్యదున్నీసా బీబీ జైనబ్బి రహంతుల్లా అలైహా అమ్మవారి ఉరుసు ఘనంగా జరుగుతోంది. ఇందులో భాగంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకూ డప్పులు, మేళతాళాలు, యువకుల నృత్యాల మధ్య స్వామివారి షంషీర్‌ను గుర్రంపై ఉంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా జైనబ్బీ దర్గా వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తెలంగాణ నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి చక్కర, బెల్లం తులాబారం ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు.

రేపు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

ఉరవకొండ : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకట్‌గురూజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారు సెల్.. 63008 58687 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా పేరు నమోదు చేసుకుని అడ్రస్ వివరాలు పంపాలని కోరారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఉరవకొండ పోలీస్‌స్టేషన్ ఎదురుగా, కరెంట్ ఆఫీస్ ముందు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన : ఎమ్మెల్యే పద్మావతి

ప్రజాశక్తి-నార్పల

రాష్ట్రంలో జగన్ అధికారం లోకి వచ్చాక ప్రజల వద్దకే ప్రభుత్వ పాలనను తీసుకొచ్చారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. భుక్రవారం మండల పరిధిలోని నాయనపల్లి, నడిమిదొడ్డి, చామలూరు, బొందలవాడ గ్రామాల్లో పూర్తయిన రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడకుండా అన్నిసేవలనూ గ్రామాల్లోనే ప్రజలకు అందాలన్న ఉద్దేశంతోనే సిఎం జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ప్రజలు ఎక్కడా ఇబ్బంది పడకుండా ప్రజల వద్దకే అధికారులు వచ్చే విధంగా చేశారని ప్రతి శాఖకూ సచివాలయ భవనాలతోపాటు రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశారన్నారు. వాటి ద్వారా ప్రజలకు సులభంగా సేవలు అందిస్తున్నట్లు వివరించారు. కాగా నేటి ఎమ్మెల్యే పర్యటన వాయిదా పడినట్లు ఎంపిడిఒ దివాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ ఛైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, ఎంపిడిఒ దివాకర్, తహశీల్దార్ హరికుమార్, కోఆప్షన్ సభ్యులు సబిరా, ఎంపిటిసిలు, సచివాలయ ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

అన్నమయ్య జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ వివేక్‌పై దాడి అమానుషం

అనంతపురం : అన్నమయ్య జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ వివేక్‌పై దాడి చేయడం అమానుషమని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హుసేనప్ప ఖండించారు. శుక్రవారం అటవీ శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సానిపాయ అటవీ రేంజ్ పరిధిలో కొంతమంది అటవీ భూమి కోసం అటవీ శాఖకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే ఆర్ఓఎఫ్ ఆర్ యాక్టు-2006 ప్రకారం ఎవరైతే 2005వ సంవత్సరం కంటే ముందు నుంచి భూమిని సాగు చేసుకుంటున్నారో వారే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనేపథ్యంలో భూమికోసం దరఖాస్తు చేసుకున్న వారు అనర్హులు ఉన్నారని డిస్టిక్ లెవెల్ కమిటీ, కలెక్టర్ ఆధ్వర్యంలో దరఖాస్తులను తిరస్కరించారన్నారు. దీంతో జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ వివేక్‌పై కొంతమంది మహిళలు దరఖాస్తుదారులతో దాడి చేయించారన్నారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రెసిడెంట్ హుసేనప్ప, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామ్‌సింగ్, శ్రీనివాసులు, ఎఱ షానవాజ్, డివిజన్ ఆఫీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన టిడిపి రిలే దీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టిడిపి అధినేత చంద్రబాబును తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ టిడిపి అనంతపురం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక రిలే దీక్షలు శుక్రవారం కొనసాగాయి. సాయంత్రం అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి నాయకులు ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేశారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో పోలీసులు నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అరెస్టు అయిన వారిలో టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్.రాజు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బంగి నాగ తదితరులు ఉన్నారు.

ఉరవకొండ : టిడిపి అధ్యక్షులు చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఉరవకొండలో సబ్ రిజిస్టర్ కార్యాలయం పక్కన వజ్రకరూరు మండల టిడిపి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 3వరోజు కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల నాయకులను అరెస్టు చేసి సిఎం జగన్ పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా నల్ల రిబ్బన్లు కళ్లకు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంకటేసులు, నాయకులు నాగేంద్ర, దస్తగిరి, మండి.ఎర్రిస్వామి, తట్రకల్ సుధాకర్, ప్యాపిలి నాగేంద్ర, ఓబులేసు, మాజీ ఎంపిటిసి నాగన్న, వన్నూరుస్వామి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సిటీ : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మాజీమంత్రి పరిటాల సునీత చేపట్టిన రిలేదీక్షలకు రామగిరి మండలం ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం మద్దతు తెలిపారు. మద్దతు తెలిపిన వారిలో ఎంఆర్‌పిఎస్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే లింగమయ్య, నాయకులు నాగభూషణ, బోడెప్ప, సునీత, తదితరులు ఉన్నారు.

కళ్యాణదుర్గం : అక్రమ అరెస్టులతో చంద్రబాబుని బయపెట్టలేరని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి అన్నారు. శుక్రవారం స్థానిక వాల్మీకి సర్కిల్‌లో చేపట్టిన రిలేదీక్షలు శుక్రవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఏమాత్రం లేదన్నారు. అంబేద్కర్ రాజ్యాంగానికి బదులు రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. వెంటనే చంద్రబాబును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోరేపల్లి మల్లికార్జున, ఉన్నం మారుతీ, రామ్మోహన్‌చౌదరి, వైపీ.రమేష్, శ్రీనివాసరెడ్డి, గోళ్ళ వెంకటేశులు, శివన్న తదితరులు పాల్గొన్నారు.


అనంతపురంలో టిడిపి నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

శింగనమల : చంద్రబాబుకి తోడుగా నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి తెలిపారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి నాయకులు మండల కేంద్రంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం కూడా కొనసాగాయి. వీరి దీక్షలకు సిపిఐ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆలం వెంకటనరసానాయుడు, రామలింగారెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి నాగరాజు, నాయకులు గోరంట్ల మారుతీనాయుడు, కుళ్లాయప్ప, ఎం.ఆదినారాయణ, రాగే పరశురాముడు, వెంకటేశ్వర్‌నాయుడు, మాసుల చంద్రమోహన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


జెఎన్‌టియులో మోక్షగుండం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి రంగజనార్ధన ప్రతి సంవత్సరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 15న ఇంజనీర్స్ డేను జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యస్.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, టి.బాలనరసయ్య, జి.మమత, శారద, ఇంజనీర్ వినయ గుప్త, రిజిస్ట్రార్ సి.శశిధర్, డైరెక్టర్లు ఇ.కేశవరెడ్డి, వి.సుమలత, బి.ఈశ్వర్‌రెడ్డి, పద్మ సువర్ణ, సుజాత, వి.బి.చిత్ర, సి.శోభాబిందు, సురేష్‌బాబు, దుర్గాప్రసాద్, సుబ్బారెడ్డి, బి.చంద్రమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
అలాగే నీటి పారుదల శాఖ కార్యాలయాల్లో ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ రాజా, కార్యనిర్వాహక సాంకేతిక నిపుణులు రాజా స్వరూప్, రామకృష్ణయాదవ్, ఉప కార్యనిర్వాహక సాంకేతిక నిపుణులు ఎం.వెంకటరమణ, హెచ్ఎల్‌సి సహాయ నిపుణులు, హంద్రీనీవా సుజల స్రవంతి ఉద్యోగులు పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్ : స్ఫూర్తి ప్రదాతగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని మేయర్ మహమ్మద్ వసీం కొనియాడారు. ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని శుక్రవారం నగర పాలకసంస్థలోని మేయర్ ఛాంబర్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన సేవలను స్మరించుకున్నారు. తర్వాత ఇంజినీరింగ్ అధికారులను శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : అలాగే జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మోక్ష గుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు ఎల్ఎం.మోహన్‌రెడ్డి, సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఏథర్' షోరూం ప్రారంభం

ప్రారంభించనున్న హీరోయిన్ కామ్నా జఠ్మలానీ

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కోవూరు నగర్ ఎక్స్‌టెన్షన్‌లో డి మార్ట్‌కు ఎదురుగా మొబిలిటీ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏథర్ షోరూంను ప్రముఖ హీరోయిన్ కామ్నా జఠ్మలానీ శనివారం ప్రారంభించనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.నివేదితరెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ కాలుష్య రహిత సమాజమే లక్ష్యంగా ఉత్పత్తి చేస్తున్న ఏథర్ వాహనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. అద్భుతమైన ఆధునిక టెక్నాలజీతో.. అత్యధిక మైలేజీ.. ఆకర్షణ ఉన్న వాహనాలను రూపొందించినట్లు తెలిపారు. అంతేగాకుండా ఆకర్షణీయమైన మోడల్స్, సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం కోసం ఏథర్ ద్విచక్ర వాహనాలను తీసుకొస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఏథర్ షోరూం

ఒంటరిగానే పోటీ : ఎమ్మెల్యే అనంత

అనంతపురం : ఎవరు ఏకమైనా రానున్న ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాపులకు రాజ్యాధికారం అంటూ జనసేన పార్టీని పెట్టిన పవన్ కళ్యాణ్ చివరకు ఆ సామాజిక వర్గ ఆత్మగౌరవాన్ని టిడిపి కాళ్ల వద్ద తాకట్టుపెట్టారని విమర్శించారు. పవన్ వ్యవహారశైలిపై కాపు సామాజిక వర్గం ఆలోచించాలని కోరారు. 2014లో టీడీపీ, జనసేనకు పవన్‌కళ్యాణ్ మద్దతు ఇచ్చి, 2019 ఎన్నికల్లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేక ఓట్లతో వైసీపీకి లబ్ధి కలగకూడదన్న లక్ష్యంతో పొత్తు లేకుండా పోటీ చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా కేవలం వైసీపీని ఓడించాలన్న ఆలోచనతోనే టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకుంటున్నాయన్నారు. 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు దోపిడీ పాలన చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమను మళ్లీ గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

అభద్రతాభావంతోనే టిడిపి, జనసేన పొత్తు

ఉరవకొండ : అభద్రతాభావంతోనే టిడిపి, జనసేన పొత్తు పెట్టుకున్నాయని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత బలమైన వ్యక్తిగా సిఎం జగన్ మారిపోయాడని చెప్పేందుకు వీరి కలయికే ఒక ఉదాహరణ అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ అవినీతిలో చంద్రబాబు అరెస్టు అయిన తర్వాత టీడీపీ నిర్వీర్యమైందన్నారు. కేవలం పచ్చ మీడియా తప్ప చంద్రబాబు అరెస్టును ప్రజలెవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఈనేపథ్యంలో తాము ఎప్పటికీ అధికారంలోకి రాలేమనే భయంతో చంద్రబాబు తన కుటుంబ సభ్యులతోపాటు పవన్‌కళ్యాణ్‌ను జైలుకు పిలిపించుకుని హడావుడిగా పొత్తు ప్రకటన చేయించారని విమర్శించారు. సిఎం జగన్ సంక్షేమం, అభివృద్ధి పాలనను ప్రతిపక్ష కార్యకర్తలు సైతం మెచ్చుకుంటున్నారు. దీంతో జగన్మోహన్‌రెడ్డి చెప్పినట్లుగా 175 స్థానాలు గెలుస్తాడనే వణుకు మొదలైందన్నారు. ఇక పొత్తుపెట్టుకోకపోతే రాష్ట్ర రాజకీయాల్లో కనుమరుగు కాక తప్పదని భావించి పొత్తులకు పూనుకున్నాయన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి : ఎంపీ

అనంతపురం : మనిషి నిలువెత్తు ధనాన్ని సంపాదించినా.. అనుభవించడానికి ఆరోగ్యం లేకపోతే అంత వ్యర్థం అని, మానవ మనుగడ కొనసాగాలంటే పర్యావరణ పరిరక్షణ చాలా ముఖ్యమని ఎంపీ తలారి రంగయ్య తెలిపారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సాయి ట్రస్టు అధ్యక్షులు విజయ సాయికుమార్ ప్రముఖులకు శుక్రవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఎంపి తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి అందించారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ వినాయకుడిని ఏ రూపంలో ఉన్నా మట్టితో చేసిన వినాయకుడినే పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్, సాయిట్రస్ట్ రాఘవేంద్ర, నారాయణనాయక్, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

గుత్తి : గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో నిర్వహించారు, పోటీలు అండర్ 14,అండర్ 17 బాలబాలికలకు 3 రోజులు పోటీలు జరిగాయి. మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుష్పరాజు మాట్లాడుతూ గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలను క్రీడా ఎంపికలకు వేదికగా ఏర్పాటుచేసి 3 రోజుల పాటు 600 మంది విద్యార్థులకు భోజన సదుపాయంతో పాటు క్రీడలకు సంబంధించిన అన్ని వసతులు ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పోటీల్లో విజేతలకు గేట్స్ కళాశాల యాజమాన్యం తరపున గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గేట్స్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి గజ్జల రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ, తదితరు పాల్గొన్నారు.

సిద్ధలాపురం ఘటన బాధాకరం : బండారు రవికుమార్



అనంతపురం : బుక్కరాయసముద్రం మండలం సిద్ధలాపురం గ్రామంలో జరిగిన ఘటన చాలా బాధాకరమని బండారు రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. తమ బంధువుల కుటుంబంలో జరిగిన ఈ ఘటనకు, తనకూ ఎలాంటి సంబంధం లేదన్నారు. రాజకీయంగా తమ కుటుంబంపై బురదజల్లేందుకు కొంతమంది చూస్తున్నారన్నారు. తమ కుటుంబం ఒకరికి సాయం చేసే కుటుంబమే తప్ప.. మరొకరి సొమ్ము తినాలనేది ఎప్పటికీ లేదన్నారు. ఈ ఘటనపై తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అలాగే పోలీసులు కూడా సమగ్ర విచారణ చేపట్టి నిజా నిజాలు నిగ్గుతేల్చాలని విజ్ఞప్తి చేశారు.

గుత్తి ఇన్‌ఛార్జి సీఐగా రాజశేఖర్‌రెడ్డి



గుత్తి : గుత్తి ఇన్‌ఛార్జి సిఐగా రాజశేఖర్‌రెడ్డిని నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎం.వెంకటరామిరెడ్డి తిరుమలలో జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బందోబస్తుకు వెళ్లడంతో పామిడిలో విధులు నిర్వహిస్తున్న ఎం.రాజశేఖర్‌రెడ్డిని గుత్తి ఇన్‌ఛార్జి సిఐగా ఉన్నతాధికారులు నియమించారు. 15 రోజులపాటు గుత్తిలో ఆయన విధులు నిర్వహించనున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కణేకల్లు : జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మోసెస్, సుజాతను శుక్రవారం మండల కేంద్రంలోని మార్కెట్ స్కూల్లో ఘనంగా సన్మానించారు. వీరితోపాటు మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లక్ష్మీదేవి, గ్రూప్-2 పరీక్షలో ఎంపీడీవో ఉద్యోగం సాధించిన టీచర్ కవి రాజును ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు లక్ష్మణ్, భవానిశంకర్, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శేషారెడ్డి, మండల శాఖ అధ్యక్షులు అస్లాం బాషా, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో అన్నదానం

యాడికి : రాయలచెరువు నగరూరు రోడ్డులో ఉన్న లీలావతి వృద్ధాశ్రమంలో ఓ దాత శుక్రవారం అన్నదానం నిర్వహించారు. తన కూతురు ధరణి 2వ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేసినట్లు తల్లిదండ్రులు శాంతి, వేణుగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పరిమి కృష్ణవేణి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గొంతువాపు టీకాలు

బెలుగుప్ప: మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలోని పశువులకు శుక్రవారం గొంతువాపు టీకాలు వేశారు. గ్రామానికి చెందిన ఐదు గేదెలు గొంతువాపు వ్యాధితో గురువారం మృతిచెందిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వ్యాధి సోకకుండా దాదాపు 150 మంది పశువులకు వైద్యసిబ్బంది టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్ బాబు, పశువైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

అనంతపురం : విద్యార్థుల్లో నిక్షిప్తమైన సృజనాత్మకత వెలికి తీసినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని హౌసింగ్ బోర్డ్‌లోని హమాలీ కాలనీలో ఉన్న ఆర్యన్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు మట్టి వినాయకులను తయారు చేసి శభాష్ అనిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, సంస్థ డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, సైకాలజిస్ట్ లహరి, డైరెక్టర్లు నాగరాజు, సందీప్, కత్తి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎల్‌సి పరిశీలన

నార్పల : మండలంలోని బొందలవాడ గ్రామం నుంచి గంగనపల్లి మీదుగా గడ్డంనాగేపల్లి వరకూ ఉన్న హెచ్ఎల్‌సిని సిపిఐ నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువ వెంబడి ఏపుగా ముళ్లకంప పెరిగి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందన్నారు. వెంటనే అధికారులు, ప్రభుత్వం స్పందించి కాలువ సుందరీకరణ పనులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గంగాధర్, సహాయ కార్యదర్శి రమేష్, సుధాకర్, నాగరాజు, పెద్దయ్య, నారాయణప్ప, రైతుసంఘం మండల నాయకులు జోసెఫ్, షెక్షా, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని పెద్దాసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ 'ఇంజనీర్స్ డే', సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని శ్రీసాయి ఆదిత్య కన్‌స్ట్రక్షన్ అధినేత, ఆశ్రమం నిర్వాహకులు పురుషోత్తమ మురళీకృష్ణ సహకారంతో అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కవీన్ ఆదిత్య, సుబ్రమణ్యం, నబిరసూల్, ఓబుళపతి, కిష్టప్ప, రవికుమార్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తరిమెల రమణారెడ్డి ఔదార్యం

అనంతపురం : నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళకు అమ్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు తరిమెల అమర్‌నాథరెడ్డి చేయూతనందించారు. నగరంలో 3వ రోడ్డులో రైల్వేట్రాక్ దగ్గర కొంతకాలంగా యాచకురాలు కాంతమ్మ పక్షపాతంతో రెండు కాళ్లు, చేతులు పనిచేయకపోవడంతో జీవనం ఆగమ్య గోచరంగా మారింది. ఈనేపథ్యంలో యాచకురాలి దీనస్థితిని స్థానికులు తరిమెల రమణారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో నిత్యావసర సరుకులు, మందులు, దుస్తులు, బెడ్ షీట్లు అందజేశారు. అంతేగాకుండా అక్కడే ఒక షెడ్ వేయించి వైద్యం చేయించారు. రమణారెడ్డి సేవ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ సంస్థ సభ్యులు పలువురు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి

పుట్లూరు : ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని రంగరాజుకుంట గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. రంగరాజుకుంట గ్రామానికి చెందిన చిన్న సంజీవరెడ్డి కుమారుడు ప్రసాద్‌రెడ్డి (30) తన ట్రాక్టర్‌తో పొలం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలో రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ప్రసాద్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు.